# పెళ్ళంటే

- యం. వెంకటేశ్వరరావు

"డాడీ! రవీంద్ర అంకులొచ్చారు" హోంవర్క్ చేస్తున్న ప్రణవి చెప్పడంతో బయటికొచ్చాను. రవీంద్రను చూసి-

"రా! రా! ఊర్నుంచి ఎప్పుడొచ్చావు?" అంటూ హాల్లోకి నడిచాను. నా వెనుకే వచ్చి మౌనంగా సోఫాలో కూర్చున్నాడు.

"మృదులా కాఫీ పట్రా" హాల్లోంచే ఆర్డరేసాను.

"వద్దు... ఇప్పుడే తాగాను."

"అరె! ఎప్పుడూ లోపలికొస్తూనే కాఫీ గీఫీ లేదా అనే నువ్వు ఈ వేళేంటి కొత్తగా మాట్లాడుతున్నావు?"

రవీంద్ర మౌనంగా టీపాయ్ మీదున్న పేపర్ చేతిలోకి తీసుకున్నాడు.

మృదుల ఇద్దరికీ కాఫీ ఇస్తూ రవీంద్రతో "ఊర్నుంచి ఎప్పుడొచ్చారు?" అంది.

"రాత్రి" అన్నాడు ముక్తసరిగా.

కాఫీ తాగుతూ రవీంద్ర వైపు చూసాను. ఎప్పుడూ గలగలా మాట్లాడే రవీంద్ర పొడిపొడిగా మాట్లాడుతుంటే సమ్‌థింగ్ రాంగ్ అనుకున్నాను.

రవీంద్ర నాకు పరిచయమై ఆరేళ్లు దాటింది. అయినా అరవై సంవత్సరాల సాంగత్యంలా ఫీలవుతాం ఇద్దరం.

అతని కంటే నేనో సంవత్సరం పెద్ద. మూడు ముళ్లూ వేసిన నా భార్యకి నా గురించి ఎంత తెలుసో అంతకంటే ఎక్కువే రవీంద్రకు తెలుసు. అలాగే అతని గురించి నాకూ.

కాఫీ తాగి పేపర్లో కళ్ళు కదుపుతున్న రవీంద్ర మౌనాన్ని మాటల్లో పెడుతూ "ఊ... పెళ్లెలా జరిగింది?"

ఫ్రెండ్ పెళ్లికని నాలుగురోజుల క్రితం గుంటూరుకెళ్లిన రవీంద్ర మళ్లీ ఇవ్వాళ కనిపించాడు.

పేపర్ నుండి తలపైకెత్తకుండానే "పెళ్లిలో ఆమె కన్పించింది" అన్నాడు.

ఎవర్నని నేనడగలేదు ఎవర్ని చూసుంటాడో నాకు తెల్సుకాబట్టి.

మళ్లీ తనే "ఫ్రెండ్‌తో వచ్చింది. పెళ్లికూతురికి ఫ్రెండట. భోజనం చేస్తూ తలెత్తిన నాకు ఎదురుగా ఆమె భోజనం చేస్తూ కన్పించింది. నన్నామె గమనించలేదల్లే వుంది. ఆమెనే చూస్తున్న నావైపు సడెన్‌గా చూసి గబగబా లేచెళ్లిపోయింది."

రవీంద్ర చెప్పడం ఆపాడు. రెండేళ్లనాడు జరిగిన సంఘటనని అతని మనోగతం మననం చేస్తోందని నాకర్థమయింది.

"ఏమైనా మాట్లాడావా?"

"ఆమె నాకా అవకాశం ఇవ్వకుండా వెళ్లిపోయింది."

మళ్లీ మా ఇద్దరి మధ్యా మౌనం.

నాకు తెలిసిన రవీంద్రకి, ఇవ్వాళ చూస్తున్న రవీంద్రకి ఎంత తేడా!

***

ఆ రోజు ఆఫీసుకి స్కూటర్ మీదెళ్తుంటే సగం దూరం వెళ్ళేసరికి వర్షం ప్రారంభమై ఉధృతమైంది.

స్కూటర్ ఆపి ఓ బస్టాప్‌లో ఆగాను. బస్సులేవీ ఆగకుండా వెళ్తున్నాయి. అక్కడ నల్గుగైదుగురు నుంచున్నారు. వాళ్లల్లో ఒకతను నా దగ్గర కొచ్చి-

"సార్! మీరెటెళ్లాలి?' అన్నాడు.

"ఎందుకు?"

"రైలునిలయం వైపైతే నన్ను కొంచెం డ్రాప్ చేస్తారేమోనని..."

"నేనటు వెళ్లడంలేదు.'

పదినిముషాల తరువాత వర్షం తగ్గడంతో బయల్దేరాను.

సరిగ్గా గంట తరువాత ఆఫీసులో కంప్యూటర్‌లో ఇన్‌కంటాక్స్ డేటా ఫీడ్ చేస్తున్న నేను ఆఫీస్ సూపర్నెంట్ గొంతు విని తల తిప్పాను.

"వాసూ! ఈయన థామస్ రవీంద్ర. విజయవాడ నుండి మన అకౌంట్స్‌కి సీనియర్ క్లర్క్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు" అనేసరికి అతన్ని చూసిన నేను షాకయ్యాను. గంట క్రితం బస్టాపులో నన్ను లిఫ్ట్ అడిగిన వ్యక్తి. నేను రాని నవ్వును తెచ్చుకుని "హలో" అన్నాను.

అతను "నైస్ టూ మీట్ యూ" అని తన సీటు కెళ్లాడు.

మనసంతా ఏదో గిల్టీనెస్.

ఓ గంట తరువాత అతని సీటు దగ్గరకెళ్లి టీకి పిల్చాను.

"నో థాంక్స్" అన్నాడు.

"ఫర్వాలేదు రండి" అని కాస్త బలవంత పెట్టేసరికి లేచొచ్చాడు.

థర్డ్‌ఫ్లోర్ నుండి మెట్లు దిగుతూ "ఐయాం సారీ మీకు లిఫ్ట్ ఇవ్వలేకపోయాను" అన్నాను.

"ఇందులో ఏముందండీ. నేనెవరో మీకూ, మీరెవరో నాకూ తెలియదు. అపరిచితులంకదా" అన్నాడు ఈజీగా.

టీ తాగుతూ "పోయినవారం ఉప్పల్ నుండి వస్తుంటే సాయంత్రం ఏడు దాటింది. ఒకతను లిఫ్ట్ అడిగాడు. అతన్ని సికింద్రాబాద్ స్టేషన్‌లో దింపి ఇంటికెళ్లి చూసుకుంటే వెనుక జేబులో ఉన్న పర్సు మాయం. రెండు ఐదువందల నోట్లతోపాటు ఎటియం కార్డు, ఐడెంటిటీ కార్డు ఎట్సెట్రా..." ఆపకుండా చెప్పాడు.

"ఐకెన్ అండర్‌స్టాండ్. బట్ ఈ థామస్ రవీంద్ర అలాంటివాడు కాదు" అన్నాడు నవ్వుతూ.

ఆ తరువాత ఇద్దరి మధ్య ఫ్రెండ్‌షిప్ పెరిగి పెద్దదయి అతనూ మా ఫ్యామిలీలో ఒకడిగా మారాడు.

***

నేనూ ఆలోచనలో మునిగిపోయాను.

మా ఇద్దరి మౌనానికి ముగింపు పలుకుతూ "ఎంతసేపలా మాటల్లేకుండా కూచుంటారు. ప్రణవి తయారైంది. స్కూల్లో దించి రండి" అని మృదుల అనేసరికి ఆలోచన ఆపేశాం.

"నేను ప్రణవిని దించొస్తాను. ఇక్కడే వుండు" అన్నాను రవీంద్రతో.

"లేదు ఇంటికెళ్లొస్తాను. ఆఫీసులో కలుద్దాం" అని తనూ బయల్దేరాడు.

***

ఆఫీసులో ఇద్దరం తీరిగ్గా కూర్చుని మాట్లాడే సమయం దొరకలేదు. సాయంత్రం "బయటకె

ళ్దామా'' అన్నాడు రవీంద్ర.

ఇద్దరం అరగంట తరువాత టాంక్‌బండ్ మీద లాన్‌లో కూర్చున్నాం.

"వాసూ! నువ్వామె దగ్గరకు వెళ్లి జరిగింది చెప్పి ఆమెనెలాగైనా ఒప్పించి మా సమస్యని పరిష్కారం చేయాలి'' అన్నాడు రవీంద్ర.

"సరే ఏం చేద్దాం?''


"రెండురోజులు సెలవుపెట్టి ఇద్దరం వెళ్లి ఆమెతో మాట్లాడి...''

"సరే'' అన్నాను.

★★★

వేసవి మొదలయింది. ఆటోలో రైల్వేస్టేషన్‌లో దిగి ప్లాట్‌ఫారం మీదున్న మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లో ఏసిలో కాలు పెట్టేసరికి అప్పటివరకూ శరీరం మీద దాడి చేసిన ఉష్ణోగ్రత ఉపశమనం పొందినట్లు ఫీలయ్యాం నేనూ, రవీంద్ర.

ఎవరి సీట్లో వాళ్లు సెటిలయినా ఇద్దరి మనసులూ ఒకే విషయం గురించి ఆలోచిస్తున్నాయి. రైలు కదిలిన పది నిముషాలకే గుడ్‌నైట్ చెప్పాడు రవీంద్ర.



నేనూ పడుకున్నానుగానీ మనసులో కదలాడుతున్న ఆలోచనలు, కళ్ల వెన క్కొచ్చి తలుపులు కొడుతూ నిద్రాభంగం కలిగిస్తుంటే ఒక్కసారిగా జ్ఞాపకాల తలుపులు తెరిచేసరికి తలపులు తలంతా ఆక్రమించాయి.

★★★

మా కొలీగ్ సుబ్రహ్మణ్యం పెళ్లికి నేనూ, రవీంద్రా పసలపూడి చేరేసరికి సాయంత్రం అయింది. శుభలేఖ పట్టుకుని పెళ్లిల్లు వెతుక్కునేసరికి మరో అర గంట అయింది.

పెళ్లింట్లో ఎదురొచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకుని ఓ గది చూపించాడు సుబ్రహ్మణ్యం తమ్ముడు ప్రభాకర్.

స్నానం చేసి కిందకొచ్చేసరికి "భోజనాలు వడ్డిస్తున్నారు రండి" అని ప్రభాకర్ పిలవడంతో ఆకలిమీదున్న మేము భోజనాలవైపు తిరిగాం. రవీంద్ర నాముందు నడుస్తున్నాడు.

ప్రభాకర్ కుశల ప్రశ్నలడుగుతూ నాపక్కన నడుస్తున్నాడు. మేడమీద భోజనాలు.

మెట్లెక్కుతుంటే పైనుంచి వేగంగా దిగొస్తున్న అమ్మాయిల్లో ముందొస్తున్న అమ్మాయి కాళ్లకి చీర అడ్డుపడి ఎదురుగా మెట్లెక్కుతున్న రవీంద్ర మీద పడిపోయింది.

అనుకోని చర్యకి బ్యాలెన్స్ తప్పిన రవీంద్ర వెనకున్న నాపై వాలడం క్షణంలో జరిగింది.

నేను స్టడీగా నిలబడి రవీంద్రని ముందుకు నెట్టి నుంచోబెట్టాక ఆ అమ్మాయి సరిగ్గా నిలబడగలిగింది.

ఆ అమ్మాయి సిగ్గుగా "ఐయాం సారీ... తొందరగా దిగుతుంటే చీర అడ్డు పడి... ఎక్స్‌ట్రీమ్లీ సారీ" అని చెప్పి చకచకా వెళ్లిపోయింది.

ఆ క్షణం నుండి రవీంద్ర మనసు ఆమె వెనుక రన్నింగ్ మొదలుపెట్టింది. సుబ్రహ్మణ్యం పెళ్లయ్యేలోపల ఆ అమ్మాయి బయోడేటా అంతా సేకరించాడు.

★★★

పదిరోజుల తరువాత గుంటూరులో ఆమె అడ్రస్‌ను వెతుక్కుంటూ వెళ్లాం.

"మీకోసం గంట నుండి వాళ్లిద్దరూ వెయిట్ చేస్తున్నారు" అని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఇన్‌చార్జి చెప్పేసరికి రూమ్‌కెళ్లబోతున్న ఆమె తల తిప్పి చూసింది.

'ఎక్కడో చూసినట్లు వుందే?' అన్నట్లు మొహం పెట్టి మేం కూర్చున్న దగ్గరకొచ్చింది.

"ఎవరు కావాలండి మీకు?"

"మీరే?"

"మీరెవరో నాకు తెలియదే?"

"కంగారుపడకండి. మొన్న పసలపూడిలో సుబ్రహ్మణ్యం పద్మజల పెళ్లిలో మిమ్మల్ని చూసాం. భోజనాలు, మెట్లు.. బైదిబై నా పేరు శ్రీనివాస్, ఇతను థామస్ రవీంద్ర... ఇద్దరం సికింద్రాబాద్‌లో రైల్వేస్‌లో పని చేస్తున్నాం" అన్నాను.

"అలాగా! ఇప్పుడేం కావాలి?"

"మీతో మాట్లాడాలి."

"దేన్ని గురించి?"

"భయపడకండి. మీరు రూంకెళ్లి రిఫ్రెష్ అయి వస్తే బయటకెళ్లి మాట్లాడుకోవచ్చు."

ఆమె రూంలోకెళ్లి పది నిముషాల్లో వచ్చింది.

★★★

ముగ్గురం శంకర్‌విలాస్‌లో కాఫీ తాగి దగ్గర్లో వున్న పార్కుకెళ్లి కూర్చున్నాం.

ఒక్కక్షణం ఎవరు ముందు మాటల్ని మొదలుపెట్టాలన్న సందిగ్ధానికి శుభం పలుకుతూ "థాంక్యూ! వెంటనే బయటకొచ్చినందుకు" అన్నాడు రవీంద్ర.

చిన్నగా నవ్విందామె.

"ఇప్పుడేం చేస్తున్నారు మీరు?"

"కార్పొరేట్ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను."

"మీదీ ఊరేనా?" అడిగాడు రవీంద్ర.


"ఇదే ఊరైతే హాస్టల్లో ఎందుకుంటాను?"

"అవునుకదా" అన్నాడు నవ్వేస్తూ.

## నేహా ఉవాచ



'జూలీ' సినిమాలో సెక్స్ వర్కర్‌గా హాట్ హాట్ సీన్లలో నటించినందుకు తానేమీ అవమానకరంగా భావించడంలేదని, ఆ పాత్రకి తగిన న్యాయం చేసానని అనుకుంటున్నానని- ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో డేరింగ్‌గా జవాబిచ్చింది నేహా ధుపియా. మాజీ మిస్సిండియా అయిన నేహాకి అసలు తన తొలి చిత్రం 'ఖయామత్' కంటే మలి చిత్రం 'జూలీ' ద్వారానే మంచి పాపులారిటీ వచ్చిందని చెబుతుంది నేహా. తొలి చిత్రం హీరో అజయ్ దేవ్‌గన్ కావడం వల్ల తనకంతగా నటనకు అవకాశం లేకుండాపోయిందని వాపోయే నేహా మిస్సిండియా కిరీటాన్ని తాను సినిమా చాన్సులకి వాడుకున్నాననుకోకూడదని, అనుకోకుండా సినిమా తారనైయ్యానని సెలవిచ్చింది.



"మాది కర్నూలు."

మళ్లీ మాటలు మొండికేసాయి.

సడెన్‌గా రవీంద్ర "చూడండి! నేను డైరెక్టుగా చెబుతున్నాను. పెళ్లిల్లో మిమ్మల్ని చూడగానే ఇష్టపడ్డాను. దీనిని లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నా ఫర్వాలేదు. నా పేరునుబట్టి నేను క్రిస్టియన్ అని తెల్సుకున్నారనుకుంటాను. మాది సనాతన క్రిస్టియన్ ఫ్యామిలీ. నాన్న లేరు, అమ్మ ఉంది. తోబుట్టువుల్లేరు. నాన్న సంపాదించిన ఆస్తి, ఇల్లు హైదరాబాద్‌లో వున్నాయి. నాకున్న అపుడు ఈ శ్రీనివాస్. మీకు నేను నచ్చి ఔనంటే..." అని అప్పచెప్పేసాడు.

అతని వేగానికామె తడబడ్డట్టన్పించింది.

"తొందరేంలేదు. మీ పేరెంట్స్‌తో ఆలోచించి మీ నిర్ణయం చెప్పండి" అన్నాన్నేను.

ఆమె కొంచెం ఇబ్బందిగా మొహం పెట్టి "ఇంత సడెన్‌గా నేనే నిర్ణయమూ తీసుకోను, తీసుకోలేను. నాకు అమ్మానాన్నాలిద్దరూ చిన్నప్పుడే పోయారు. అక్కయ్యకి పెళ్లయింది. కర్నూల్లో వున్న మామయ్య నన్ను పెంచి, చదువు చెప్పించి ఉద్యోగస్థురాల్ని చేసారు. నేను ఆలోచించుకుని మామయ్యతో మాట్లాడి..."

"నో ప్రాబ్లం. దీసీజ్ జస్ట్ మై ప్రాపోజల్. డిస్పోజల్ ఈజ్ ఇన్ యువర్ హేండ్స్. టేక్ యువరోన్ టైం" అన్నాడు రవీంద్ర.

మరో పావుగంట తరువాత "చీకటవుతోంది వెళ్దామా?" అందామె.

ముగ్గురం నడుస్తుంటే త్రోవలో ఉన్న జగన్మాత గుళ్లోకెళ్లిందామె. తర్వాతొచ్చి నాకు ప్రసాదం పెడుతుంటే తనూ తీసుకున్నాడు రవీంద్ర.

***

ఆ తరువాత రెండుమూడుసార్లు రవీంద్ర గుంటూరుకెళ్లి ఆమెతో కొంచెం చనువు పెంచుకున్నాడు.

రవీంద్ర వాళ్లమ్మతో విషయం చెప్పేసరికి అయిష్టంగానే అంగీకరించిందామె.

నేనూ, రవీంద్ర గుంటూరుకెళ్లి ఆమెను హైదరాబాద్ తీసుకొచ్చాం.

కర్నూల్లోవున్న ఆమె మామయ్య కృష్ణమూర్తిగారింటికి వెళ్లి విషయం చెప్పి ఆయన్నీ ఒప్పించి మాతో హైదరాబాద్ తీసుకొచ్చాం.

పెళ్లి సాంప్రదాయబద్ధంగా కర్నూలులో జరిపిస్తానన్న కృష్ణమూర్తిగారి ప్రపోజల్‌కు అడ్డొస్తూ చర్చిలో క్రిస్టియన్ పద్ధతిలోనే తన ఒక్కగానొక్క కొడుకు పెళ్లి చేయాలని రవీంద్ర తల్లి పట్టుబడడంతో మళ్లీ సందిగ్ధం.

రవీంద్ర తల్లిని ఎవరూ కన్విన్స్ చేయలేకపోయారు.

చివరికి "మీ ఇంటికొచ్చే అమ్మాయి మీ ఇష్టం" అని కృష్ణమూర్తిగారు వెళ్లిపోయారు.

నేను, మృదుల, ఆమె మా ఇంటికొచ్చాం. కాసేపటికి రవీంద్ర వచ్చాడు.

"ఏం చేద్దాం?" అన్నాడామెను ఉద్దేశించి.

"ఎవర్నీ నొప్పించకుండా రిజిస్టర్ మేరేజ్ చేసుకుందాం"

"అమ్మ దానికీ ఒప్పుకోవడంలేదు. కోడలు కట్టుబట్టలతో వచ్చినా ఫర్వాలేదుగానీ చర్చిలోనే పెళ్లి జరగాలంటోంది."

"ఇప్పుడు నేనేం చేయాలి?"

"అమ్మ తృప్తికోసం నీకు చర్చిలో బాప్టిజం జరిపించి అక్కడే పెళ్లి చేసుకుందాం. ఆ తరువాత మన జీవితం మన ఇష్టం" అన్నాడు రవీంద్ర.

"కల్సి బ్రతకాలనుకున్నది మనిద్దరం. నాకూ చదువూ సంస్కారం, ఉద్యోగం ఉన్నాయి. నేనూ మిమ్మల్ని పేరు మార్చుకోమనీ, మా పద్ధతిలో వేద మంత్రాల మధ్య, నాదస్వరాల సాక్షిగా తాళి కట్టి తలంబ్రాలు పొయ్యమంటే మీరొప్పుకుంటారా? ఒప్పుకోరు. మరలాంటప్పుడు నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు పెట్టిన పేరుతో ఇన్నేళ్లూ బ్రతికి, ఓ గుర్తింపు పొంది ఇవ్వాళ పెళ్లికోసం పేరు మార్చుకుని, చిన్న వయసు నుండి పూజించే దేవుళ్ని, పూజలో పఠించే శ్లోకాల్నీ, జపించే మంత్రాల్నీ త్యజించి నన్నంటి పెట్టుకున్న నమ్మకాలకి నమ్మకద్రోహం చేసి నన్ను నేను ఏమార్చుకుని మీతో మనస్ఫూర్తిగా సహజీవనం సాగించలేనేమో" అందామె ఉద్వేగంగా.

"కేవలం ఈ విషయం కోసమే పెళ్లి ఆగిపోవాలా?" రిక్వెస్టుగా అడిగాడు రవీంద్ర.

"అదే నేనూ అడుగుతున్నాను. కేవలం ఒక్క పెళ్లికోసం పుట్టుకతో వచ్చిన పద్ధతుల్ని వదలుకుని మనసు చంపుకోమంటారా?"

"అని నేననలేదు. కేవలం అమ్మకోసం... తరువాత నీ ఇష్టం"

"కేవలం అమ్మ కోసం అని మీకులా నేను ఆత్మవంచన చేసుకోలేను. అమ్మానాన్నలు లేని నన్ను పెంచి పెద్ద చేసిన మామయ్యని ఒప్పించగలిగానుగానీ నొప్పించలేను."

"మరి పరిష్కారం?" కరుగ్గా అన్నాడు రవీంద్ర.

## దొంగ దొరికాడు

జర్మనీలోని బుయిల్ నగరంలో ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఆ దొంగని పట్టుకోవడానికి పోలీసు డిటెక్టివ్ వాల్టర్ రెండునెలలుగా ప్రయత్నిస్తుండగా అతనికి హఠాత్తుగా గాల్‌బ్లాడర్‌లో రాయి ఉందని డాక్టర్లు చెప్పడంతో సెయింట్ జోసెఫ్ హాస్పిటల్లో చేరాడు. ఆపరేషన్ తర్వాత అతను రెస్ట్ తీసుకుంటూ తన ప్రక్క బెడ్డు మీదున్న పేషెంట్‌తో యథాలాపంగా కబుర్లలో పడ్డాడు. ఆ పేషెంట్‌కి హఠాత్తుగా అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగిందట. ఆ కబుర్లలో ఊరంతా రెండునెలలుగా ఏ దొంగకోసం తను తిరుగుతున్నాడో అతనేనని డిటెక్టివ్‌కి తెలిసింది. ఇప్పుడా దొంగని సెక్యూరిటీ జైలులోని హాస్పిటల్‌కి తరలించారు.

## ప్రణయంలో ప్రమాదం

ఇటీవల ఆరంతస్తుల పేరిస్ ఒపెరా హోటల్లో పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. ఓ ప్రేమజంట మధ్య కలహం దీనికి కారణమట. ఆ హోటల్ వాచ్‌మన్‌కి ఓ గర్ల్‌ఫ్రెండ్ ఉందిట. అతను మత్తుగా త్రాగి తన మాటపట్టించుకోవడం లేదని కోపం వచ్చి ఆ భామ ఓ బట్టలమూటని అతనికి మీదికి తోసి వెళ్ళిపోయింది. ఆ మూట వెళ్ళి ఓ కొవ్వొత్తుల మీద పడి అవి అంటుకున్నాయి. అంతేక్షణంలో అగ్నిప్రమాదం జరిగి 23మంది ఆహుతైయ్యారు. ఈ ప్రమాదంలో వాచ్‌మన్ కోమాలోకెళ్ళి పోయాడు. ఆమె తర్వాత తనవల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలుసుకుని ఘొల్లుమంది.

-తటవర్తి



"చూడండి మిస్టర్ రవీంద్రా! మన పరిచయానికి వయసు కేవలం రెండు నెలలు మాత్రమే. రెండునెలల పరిచయం కోసం, పాతికేళ్ళుగా నాలో ఇమిడిన పద్ధతుల్ని పూడ్చిపెట్టి జీవితాంతం పశ్చాత్తాపపడలేను."

"అంటే?"

"నా దృష్టిలో పెళ్లంటే ఒక గూడు కింద ఒకరికి ఒకరై జీవితాంతం కలసి బ్రతకడంగానీ, పెళ్లి పేరుతో ఇన్నేళ్లూ నాతో వున్న సంస్కారానికి అంతిమ సంస్కారం చేయలేను. మంచి ఫ్రెండ్స్‌గా విడిపోదాం. నో రిగ్రెట్స్" అందామె.

వాళ్లిద్దరి వాదన వింటున్న మా ఇద్దరికీ ఏం మాట్లాడాలో, ఇద్దరిలో ఎవర్ని సమర్ధించాలో అర్థం కాలేదు.

తరువాత నేను రవీంద్రతో, మృదుల ఆమెతో విడివిడిగా మాట్లాడినా ఫలితం కలగలేదు.

ఆ మర్నాడామె గుంటూరుకెళ్లిపోయింది.

అంతవరకూ గుర్తొచ్చిన గతం అలసిపోయి ఏసి చల్లదనానికి నిద్దరోయింది.

***

ఉదయం ఐదు గంటలకు విజయవాడలో దిగి బస్‌లో గుంటూరుకెళ్లి హోటల్లో దిగాము.

స్నానాలు చేసి ఇద్దరం రిలాక్సయ్యాము.

ఆమెతో మాట్లాడేందుకు నేను ఆమె పని చేసే కాలేజీకి బయల్దేరాను. రవీంద్ర రూములోనే వున్నాడు.

ఆమె పనిచేసే కాలేజీ దగ్గరకెళ్లి కలిసాను. నన్ను ఆశ్చర్యంగా చూసి "బాగున్నారా?" అంది.

"మీరూ?"

"ఇదిగో ఇలా... మృదులగారు, ప్రణవి బాగున్నారా?" అడిగిందామె.

"ఆ వాళ్ళు బాగున్నారు. కానీ రవీంద్ర వాళ్లమ్మ లాస్టియరు చనిపోయారు."

"అలాగా! మరి రవీంద్ర ఎలా వున్నాడు? పెళ్లయిందా?"

"ఇంకా లేదు. మీరొప్పుకుంటే అవుతుంది."

"నేనా? ముగిసిపోయినదాన్ని మళ్లీ మొదలెట్టమంటారా?"

"మీరు నమ్మినా నమ్మకపోయినా ఒక్కటి మాత్రం నిజం. ఇష్టపడ్డ మిమ్మల్ని కష్టపెట్టినందుకు రవీంద్ర చాలా ఫీలవుతున్నాడు. అందుకే తన మనసులో ఉన్న మీ స్థానాన్ని వేరెవరితోనూ భర్తీ చేయలేకపోతున్నాడు."

"అఫ్‌కోర్స్. నాదీ అదే పరిస్థితి. కానీ కాంప్రమైజయి ఆత్మాభిమానం చంపుకుని ఆత్మనూన్యతతో అతనితో మనస్ఫూర్తిగా కలవలేనేమో!"

"ఇవన్నీ మీ అపోహలు. ఒకరొకరు ఇష్టపడడానికి అడ్డురాని కులమతాలు సహజీవనానికి సహకరించాలిగానీ సమస్యలై కూర్చోకూడదు. ఒకళ్లనొకళ్ళు ఇష్టపడ్డ మీరు గత రెండేళ్ళుగా మనసుల్ని చంపుకుని మరొకర్ని ఇష్టపడకపోవడానికి కారణం ప్రేమ.

మీ ఇద్దరి మధ్యా ప్రేమా, పెళ్లికి నడుమ ఏర్పడ్డ సన్నటి పొర అడ్డు తప్పుకుంది. ఇప్పుడిక పెళ్లి గుళ్లో జరిగినా, చర్చిలో జరిగినా అంతర్యమొక్కటే. ప్రేమకైనా, పెళ్లికైనా పునాది నమ్మకం. నమ్మకానికి బలముంటే మీరనుకునే ఆత్మనూన్యతలు, ఆత్మాభిమానాలు అడ్డురావు. అనుసరించుకుపోవడం నేర్పుతుంది. ఇహ ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సింది మీరే" అని చెప్పాను.

చిప్పిల్లిన కన్నీళ్ల చుక్కల్ని సుతారంగా తుడుచుకుంటూ మౌనాంగీకారాన్ని తెలిపింది. ఆమె గీతాంజలి.

***

పదిరోజుల తరువాత-

రిజిస్టర్ ఆఫీసులో కృష్ణమూర్తిగారి సమక్షంలో నేను, మా కొలీగ్ భాస్కర్‌ల సాక్షిగా గీతాంజలీ రవీంద్రగా మారిందామె.

ఇప్పుడు-

వాళ్లింట్లో ప్రతి ఉదయం భగవద్గీతతో ప్రారంభమవుతుంది. శనివారం సుప్రభాతానికి స్వాగతం పలుకుతుంది.

గీతాంజలి పద్ధతులకి, అలవాట్లకి ఆమె భర్త థామస్ రవీంద్ర అడ్డు చెప్పడు.

అలాగే రవీంద్ర రోజూ నిద్ర లేవగానే బైబిల్ పఠనం చేస్తాడు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా చర్చికెళ్లి ప్రార్థనలు చేస్తాడు.

వాళ్లిద్దరూ ఒకరి అభిప్రాయాల్ని మరొకరు గౌరవించుకునే ఈకాలపు ఆదర్శ దంపతులు మరి.

★

## కొంపముంచిన కెమేరా ఫోన్స్

సమాచార రంగంలో ఎన్నో మార్పులొచ్చాయి. సౌదీ అరేబియాలో 3జి కెమేరా ఫోన్స్ దేన్నైనా ఇంటర్నెట్‌నుంచి యాక్సెస్ చేసుకోగలుగుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అయితే సెల్‌ఫోన్ ద్వారా ఎవరికైనా నీలిచిత్రాలు పంపితే వెయ్యి కొరడా దెబ్బలు, 12 ఏళ్ల జైలుశిక్ష, లక్ష రియాన్స్ జరిమానా కింద చెల్లించాలని సౌదీ చట్టం చెబుతోంది. మొన్నామధ్య జనవరిలో ముగ్గురిలాంటి పనిచేస్తూ దొరికిపోయారు. అందులో ఒకడు ఒక టీనేజ్ అమ్మాయిని రేప్ చేస్తున్నప్పుడు తీసిన నీలిచిత్రాన్ని ఇంటర్నెట్ ద్వారా పికప్ చేసి తన ఫ్రెండుకి కెమేరా ఫోన్ ద్వారా పంపుతూ దొరికిపోయాడు. దానికతను 1200 కొరడా దెబ్బలు తిన్నాడు. ఇలాంటి ప్రబుద్ధులు మన దేశంలో కూడా ఉన్నారు. వారికి కూడా ఇలాంటి శిక్షలు అమలు పరిస్తే ఎలా ఉంటుందో సర్కారీ వారు ఆలోచించాలి.

## ఆహారమే ప్రధానం

ఈరోజుల్లో సరైన ఆహార నియమాలు లేక చాలామంది చిన్నవయసులోనే ఊబకాయానికి గురవుతున్నారు. అధిక క్యాలరీలున్న ఫుడ్ తీసుకోవడం, సరైన శారీరక వ్యాయామం లోపించడం ఇందుకు కారణాలుగా చెప్పుకోవచ్చు. అందుకే సాత్వికాహారం తీసుకుంటూ రోజూ శరీరానికి కాసింత వ్యాయామం కల్గిస్తే మంచి ఆరోగ్యంతో పాటు చలాకీగా తిరగ గలుగుతారని ప్రపంచ ఆరోగ్యసంస్థ తెలియజేస్తోంది.

-టీఆర్.

